# 5 ఊ బి

[ఇది గుర్రపు పందాలకు సంబంధించిన కథ; అవసరమై రేస్ భాషా ప్రయోగం జరిగింది; ఆ యా పారిభాషక పదాల వివరణను ఫుట్‌నోట్స్‌లో చూడవొచ్చు]

శుక్రవారం రాత్రి యెనిమిదింటికల్లా త్రిమూర్తులు-సింగూ, ప్రసాద్, వెంకటేశ్వరరావులు మా ఇంటికి దాడికి బయలుదేరిన నాయకుల్లాగు వచ్చి పడటం నాకు ఆశ్చర్యం కలిగించింది. సాధారణంగా ఆదివారం ఉదయమే ఆ నాటి రేసుల్లో పరుగెత్తే గుర్రాలూ, జాకీలూ1, డ్రా నెంబర్లూ2 తీసుకొని రావటం, పన్నెండింటి దాకా ఏ గుర్రం గెలుస్తుందో ఇక్కడి మీటింగులో తేల్చుకోవడం, తీరా రేసులో వేరొక గుర్రం గెలవటం, దాంతో చేతులు కాలి, మొహాలు వేళ్ళాడేసుకొని నీరసంగా కొంపలు జేరి, ఒళ్ళు నెప్పులు సర్దుకోక గాఢనిద్ర నీడలో తల దాచుకోవటం పరిపాటి. మరి అర్ధాంతరంగా ఈ అర్ధరాత్రి యెమర్జెన్సీ మీటింగు యెందుకు పడిందో నాకు అర్ధమవలేదు.

"ఏక్సెప్‌టెన్సెస్3 వచ్చినయ్ సార్!" అన్నాడు సింగ్.

---

1. జాకీ: రేసులో గుర్రంమీద ఎక్కే రౌతు.

2. డ్రా నెంబరు: రేసు ప్రారంభంలో ఏ గుర్రం ఏస్థానంలో ఉంటుందో చెప్పే నెంబరు.

3. ఏక్సెప్‌టెన్స్: ఒకో గుర్రానికి, దాని పూర్వ చరిత్రను అనుసరించి 'ఇంత' బరువుతో రేసులో పాల్గొనాలని నిర్ణయించబడుతుంది. ఆ బరువుకు సమ్మతించిన తరువాత, ఆ గుర్రాలు ఒప్పుదలను ఇచ్చినట్లు;దాన్ని 'ఏక్సెప్‌టెన్స్' అంటారు.

ఇది రేసు మీటింగ్ అని తేలిపోగానే, ఈ కొలుపు ఇప్పుడే, ఇక్కడే జరుగుతే మా ఆవిడ చీపురు తీసుకుంటుందని భయపడి-మాట్లాడవద్దని వారికి సౌజ్ఞచేసి మెల్లిగా బయటపడ్డాను. అట్లా కాఫీ తాగి అసలు విషయాన్ని మధించేందుకు మురుక్కాలవ వంతెన మీదికి జేరాము.

"ఇప్పుడిప్పుడే మన గుర్రాలు ఫారం4 పడుతూన్నయ్!" అన్నాడు వెంకటేశ్వరరావు.

"పంటర్స్5 ఫారాలు దిగజారుతూన్నాయ్!" అన్నాడు ప్రసాద్.

"క్రితం వారం తిన్న దెబ్బకు ఎముకలూ, గిముకలూ కదిలిపోయినయ్ కదా! ఈ సీజన్‌కు6 మరి రేసులకు వెళ్ళకూడదనే నిర్ణయం ఏకగ్రీవంగా జరిగింది కదా! మళ్ళీ ఇప్పు డీ గొడవలన్నీ ఏమిటీ?" అన్నాను నేను.

"అన్నా మనుకోండి. లాభాల సంగతి యెలా ఉన్నా, పోయిందన్నా రికవర్ చేసుకోవద్దా?" అన్నాడు పింగ్.

"కవర్‌కు లేనప్పుడు రికవర్ సంగతి యెందుకయ్యా? పోయిందాంతో సరి అనుకోక ఇంకా సాగదీయటం యెందుకంట?" అన్నాను.

"ఛాన్సుగా ఒకటి రెండు ఫ్లూకులు7 తగులు తయ్యేమోనని ఆశ!" అన్నాడు ప్రసాద్.

"భోజనం కూడా మానుకుని పిక్కి పిక్కి, దాచి, ఈ గుర్రాలకు పెట్టాను సార్!" అన్నాడు వెంకటేశ్వరరావు.

---

4. ఫారం: శిక్షణ ద్వారా గుర్రం రేసులో పాల్గొనేందుకు తయారవగా దాన్ని 'ఫారం'లో ఉన్న గుర్రం అంటారు.

5. పంటర్: రేసులు ఆడే వ్యక్తి.

6. సీజన్: ఏడాదికి కొన్ని నెలలవరకే రేసులు జరుగుతవి;ఎండలు మరీ తీవ్రంగా ఉంటే గుర్రాలు దెబ్బతింటవి కనుక, శీతలంగా ఉన్నప్పుడే రేసులు నడుస్తవి. ఆ కాలాన్ని 'రేసింగ్ సీజన్' అంటారు.

7. ఫ్లూకు: ఎవ్వరూ కాయని గుర్రం, రేసులో గెలుస్తుందని ఎవ్వరూ అనుకోనిది; ఇలాటి దాని మీద కాచే కొద్ది మొత్తానికి, అది గెలుస్తే అత్యధికంగా వొస్తుంది.

"అవునయ్యా! నీ సంపాదనలో నీవు తినేందుకూ, గుర్రాలకు పెట్టేందుకూడా యెక్కణ్ణుంచి వస్తుందీ? అందుకని నీవు తినటం మాని ఆ గుర్రాలకు పెట్టావు—అది సబబే!" అన్నాడు ప్రసాద్.

"డబ్బు పోయిందిగాక ఇంకా ఈ తరచటంవల్ల మరింత దుఃఖమూ, క్షోభా కలుగుతయ్. కనుక అసలు సంగతేదో తేల్చి పారేసి ఈ చలికి ఈ వొంతెనమీద గడ్డకట్టుకొని చావకముందే-కొంపలుజేరి రగ్గులు కప్పుకొని వెచ్చగా పడుకోవటం మంచిది!" అన్నాను కాస్త చికాకుగా.

"ఏక్సెప్‌టెన్సెస్ మహా ఆశాజనకంగా ఉన్నాయ్ సార్! పెద్ద పెద్ద ఫీల్డ్సు8. ఒకో రేసులో 14-15 గుర్రాలు! మనం సంపాయించుకునేందుకు ఇదే మంచి తరుణం!"

సింగ్ చెప్పేదానికి అడ్డుపడి-"మంచి తరుణం-మించిపోవును! ఆలసించిన ఆశాభంగం!" అన్నాడు వెంకటేశ్వరరావు.

"పంటర్స్ మళ్ళీ కాస్త ఫారం పడుతూన్నట్టున్నారే!" అన్నాను.

"ఇంకా లేదు సార్....రేసులకు వెళ్ళటం ఇదే చివరిసారి అని నిశ్చయించుకున్నాం!" అన్నాడు ప్రసాద్.

"క్రితం ఆదివారమే చివరిసారి అని నిర్ణయించుకున్నాం. దాలిగుంటలో కుక్కల్లాగు శుక్రవారంనాటికే మీ నిశ్చయం నీరుకారిపోయిందన్నమాట! మీ వ్యవహారం మీరు చూసుకోండి. నేనుమాత్రం రాను" అన్నాను.

ముగ్గురూ కాస్సేపు మౌనం వహించారు.

"పురజనుల కోరికమీద ఈసారికి మాత్రం మీరు రండి—" అన్నాడు సింగు.

"పురజనుల డబ్బుమీద ఆడుతున్నామా! నేను రానంటే రాను!" అన్నాను, నిశ్చయం ధ్వనించే కంఠస్వరంతో.

"మీతో ఒక సహాయం కావాలి!"

---

8. ఫీల్డ్: పాల్గొనే గుర్రాల సంఖ్యనుబట్టి 'పెద్ద' 'చిన్న' నిర్ణయం ఉంటుంది. ఎక్కువ గుర్రాలు రేసులో పాల్గొంటే, ఏ గుర్రంమీద కాచినా ఎక్కువ వొచ్చే అవకాశం ఉంటుంది; అందులోనూ ఎవ్వరూ ముట్టనిదాన్ని పట్టుకోగలుగుతే జూదరి పంట పండినట్లే!

నిజానికి వీళ్ళనే ఏక్సెప్ టెన్సెస్ నేను మధ్యాహ్నమే చూశాను. నాకు తెలిసిన ట్రైనర్9 తాలూకు గుర్రాలు నాలుగు పరుగెత్తుతూ ఉన్నవి. ఛాన్సు గానే ఉన్న దనుకున్నాను—అంతలోనే మళ్ళీ మనస్సు అటు పీకుతూన్నందుకు నన్ను నేనే దూషించుకున్నాను. ఆ కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపి పారేశాను. అయితే మాత్రమేం—అది నా కళ్ళముందు పెద్ద పెద్ద టైపుల్లో ప్రింటు చేసిన పోస్టర్‌వలె కళ్ళముందు వేళ్ళాడుతూ, మెదడులో మెరుపులు మెరిపిస్తూనే ఉన్నది. వ్యసనం అంటేనే ఇంత!

వీళ్ళు కోరే సహాయం ఏమిటో కూడా నాకు తెలుసు. ఆ ట్రైనర్ దగ్గరికి వెళ్ళి ఇన్‌ఫర్‌మేషన్10 తెమ్మంటారు. ఇదివరకు తెచ్చిన ఇన్‌ఫర్‌మేషన్ తాలూకు గెలవవలసిన గుర్రాలు బోర్డులో11 కూడా లేనందువల్లనే కదా చేతులూ, మూతులూ కూడా కాలినవి! నాకు ఛర్రుమంది!

"ఇన్‌ఫర్‌మేషన్‌వల్ల లాభంలేదు. మీ థియరిస్టులు12 లెక్కలుకట్టి తేల్చండి!" అన్నాను.

---

9. ట్రైనర్: అశ్వ శిక్షకుడు.

10. ఇన్‌ఫర్‌మేషన్: రేసుల్లో పాల్గొనే గుర్రాల యజమానులూ, అశ్వ శిక్షకులూ, జాకీలూ తదితర సిబ్బందీ ఫలానా గుర్రం గెలుస్తుందనే విషయాన్ని చెప్పగలరనే నమ్మకంతో, వాళ్ళ చుట్టూ తిరిగి తెలుసుకొని వాచ్చే గాలికబురు-ఇన్‌ఫర్‌మేషన్ అనబడుతుంది.

11. బోర్డ్: రేసులో ఎన్ని గుర్రాలు పాల్గొన్నప్పటికీ మొదటి నాలుగు స్థానాలనూ ఆక్రమించగలిగిన వాటి నెంబర్లే బోర్డ్ మీద వేస్తారు. 'బోర్డ్‌లో కూడాలేదు' అంటే మొదటి నాలుగింటా లేదు; ఆ తరువాత అది ఎక్కడున్నా ఒకటే;ఇప్పట్లో అది గెలుస్తుందనే ఆశ అనవసరమన్న మాట!

12. థియరిస్ట్: గుర్రం మీది బరువూ, అది పరుగెత్తవలసిన దూరాన్ని బట్టీ, అంతకుక్రితం అది పరుగెత్తిన వివరాలనుబట్టీ. ఇప్పుడు యెంత వ్యవధిలో రాగలదో అంచనాలు వేసి, ఏది గెలిచేందుకు అవకాశ మున్నదో నిర్ణయిస్తారు; ఈ లెక్కలు కట్టేవాణ్ని థియరిస్టు (సిద్ధాంతి!) అంటారు.

"అదీ లాభంలేదని తేలిపోయింది సార్!" అన్నాడు వెంకటేశ్వర రావు.

"అసలు రేసులే లాభం లేదనే స్వల్పవిషయం ఇప్పటికీ మీ బుర్రలకు యెక్కలేదు కదా!" అని విచారాన్ని వెలిబుచ్చాను.

"ఇదే చివరిసారి అని వాగ్దానం చేస్తున్నాం సార్! మీ కాళ్ళు పట్టుకుంటాం. ఆ ట్రైనర్ జాక్సన్‌గాణ్ణి ఆశ్రయించి ఇన్‌ఫర్‌మేషన్ కొట్టుకు రండి. మీరు మానుకుంటే మానె—మేమైనా ఈ ఊబిలోంచి బైట పడతాం!" అన్నాడు సింగు.

"ఊబిలో పడ్డాక—బయట పడదామని గుంజుకొన్నకొద్దీ కూరుకొని పోవటమే జరుగుతుంది!" అన్నాను.

"నిజమే అనుకోండి! ఏ బలమైన గుర్రాన్నో ఆశ్రయించి తాడువేసి లాగిస్తే బైటపడతామని ఆశ" అన్నాడు ప్రసాద్.

కాదు కూడదంటే వీళ్ళు వొదిలేట్లు కనిపించలేదు. ఈ నడిరోడ్డుమీద చలిలో కాళ్ళు కూడా పట్టుకుంటారేమోననే భయం వేసింది.

"సరే. ఇదే చివరిసారి. నే నసలు ఆ జాక్సన్‌గాడి మొహం కూడా చూడ దలచలేదు. ఈసారికిమాత్రం వాడి దగ్గిరికి వెళ్ళివస్తాను. ఇకముందు మాత్రం నన్ను వేధించవద్దు!"

"కృతజ్ఞులం!" అన్నారు ముగ్గురూ ఒకేసారి.

"ఆదివారం ఉదయం పదింటికి మా ఇంటికి రండి!"

అప్పటికి ఆ సమావేశం పూర్తయింది.

## 2

వీళ్ళకు ఎలాగైనా బుద్ధి చెప్పాలనే నిశ్చయానికి వచ్చాను. జాక్సన్ గాడు కాదుకదా-బ్రహ్మదేవు డిచ్చిన ఇన్‌ఫర్‌మేషన్‌మీద కూడా నాకు నమ్మకం లేదు. అందువల్ల ఒక డార్క్ ఫ్లూక్ 13-బహుశా ఆ ట్రైనరూ,

---

13. డార్క్‌ఫ్లూక్: ఎవ్వరూ యెట్టి పరిస్థితుల్లోనూ తలచని గుర్రం. అదే వొచ్చి పడితే, దాని మీద కాచినవాడికి ఒకటికి నూరురెట్లు దాకా వస్తుంది. అలాటిదాన్ని 'డార్క్ ఫ్లూక్' అంటారు. ఎవరి కంటికీ కనిపించకుండా చీకట్లో నక్కి దాక్కున్న అదృష్టదేవత అన్నమాట!

గుర్రపు యజమానీ, చివరకు జాకికికూడా నమ్మకం లేనిదాన్ని ఏరి - ఇదే జాక్‌సన్ ఇచ్చిన ఇన్‌ఫర్‌మేషన్ అని చెబుదా మనుకున్నాను.

ఇందువల్ల రెండు ఉపయోగా లున్నవి. మొదటిది: అది ఎలాగూ రాదు కనుక వీళ్ళ జేబుల్ని అంటపొడుస్తుంది. ఒళ్ళంతా కాలటంతో శాశ్వతంగా, లేదా, కనీసం మరో సంవత్సరందాకానన్నా వీళ్ళు కోలుకోరు. రెండోది జాక్సన్‌గాడి ఇన్‌ఫర్‌మేషన్‌మీద వీళ్ళకు పూర్తిగా నమ్మకం పోతుంది; కనుక నన్ను మరి వేధించరు.

ఆదివారం నాటికి యీ బ్రహ్మాస్త్రాన్ని వీళ్ళ కోసం సిద్ధంగా వుంచాను.

పదింటికి వస్తామన్నవాళ్ళు తొమ్మిదిన్నరకే ఊడిపడ్డారు.

సోది పెంచటం అనవసర మనుకున్నాను. వాదోపవాదాలు జరుగుతే నాక్కూడా రేసుకు వెళ్ళా లనిపిస్తుందనే భయం కూడా పీడిస్తోంది! అందు కని "మూడో రేసులో ఆరో నెంబరు!" అన్నాను.

ముగ్గురూ ఆతృతగా భగవద్గీతలు 14 విప్పారు. ఒకేసారి పెదవులు విరిచారు!

"జాక్‌సన్ ఇదే చెప్పాడా సార్!" అన్నాడు సింగ్ అనుమానం ఉట్టిపడేట్లు!

---

14. భగవద్గీత: రేసు పుస్తకం. దీంట్లో అన్ని వివరాలూ ఉంటవి. ఒకో గుర్రం అదివరకు యెన్ని రేసుల్లో పాల్గొన్నదీ, ఏయే బరువుల్తో పరుగెత్తిందీ, ఏ స్థానంలో గమ్యస్థానాన్ని జేరిందీ, ఒకవేళ రేస్ గెలిచి ఉంటే యెంత కాలంలో ఆ దూరం పరుగెత్తిందీ, ఎవరు యెక్కిందీ, మొదలైనవే గాక, దాని తల్లిదండ్రులూ, వంశపారంపర్యతా, వయస్సూ, యెంత ఖరీదుకు కొనబడింది మొదలైన వివరాలు కూడా ఉంటవి. ఈ చరిత్రకు తోడు, ఇప్పుడు యెంత బరువుతో, యెంత దూరం యెవరు యెక్కగా పరుగెత్తుతోందీ, ఆ రౌతు ధరించే దుస్తుల రంగులూ, రేస్‌కు బయలుదేరేప్పుడు ఏస్థానంలో నిలబడుతుందీ (డ్రా నెంబర్), ఆ గుర్రం మీద ఉండే నెంబర్ (కార్డ్ నెంబర్) ఏమిటి, గుర్రం యజమాను లెవరు, అశ్వశిక్షకు డెవడు మొదలైన వివరాలన్నీ ఇవ్వబడే పుస్తకం.

"అతను చెప్పింది అదే మరి!" అన్నాను.

"స్ట్రాంగ్‌గా చెప్పాడా సార్?" అన్నాడు వెంకటేశ్వరరావు.

"అదొక్కటే స్ట్రాంగ్ అన్నాడు!" అన్నాను.

"ఇదివరకు ఎప్పుడూ బోర్డు కూడా టచ్ చేయలేదు!" అన్నాడు ప్రసాద్.

"ఆరు ఫర్లాంగులకే పిత్తుకుంటోంది. ఇప్పుడు ఏడు ఫర్లాంగుల రేసు!" అన్నాడు వెంకటేశ్వరరావు.

"అందులోనూ అప్రెంటిస్ జాకీ 15 దేవిడ్‌గాడు ఎక్కేది!" అన్నాడు సింగు!

ఎలాగైనా వీళ్ళను నమ్మించవలసిన బాధ్యత నా మీద పడింది.

"అప్రెంటీస్ కనుకనే మరీ ఛాన్స్. వాడికి ఏడు పౌనులు ఎలవెన్స్ ఉన్నదనే సంగతి మరచిపోతున్నారు!" అన్నాను.

"ఈ లక్కీ క్వీన్ మొన్ననే స్టడ్ 16 నుంచి వచ్చింది. ఇదేం పరుగెత్తుతుంది సార్!" అన్నాడు ప్రసాద్.

"దానికీ నాలుగు కాళ్ళూ ఉన్నాయ్! కూప్ 17 చేస్తారనుకుంటాను, ఎవ్వరూ ముట్టుకోకుండా ఉండేందుకే దేవిడ్‌గాణ్ని ఎక్కిస్తున్నారు! ఇది

---

15. అప్రెంటీస్ జాకీ: రౌతుగా (జాకీగా) గుర్తించబడే ముందు అప్రెంటిస్‌గా ఉండాలి. ఇలాటి వాడికి కొరడా ఇవ్వరు. ఐతే ఆ గుర్రం మోయవలసిన బరువులో 7 పౌనులు తగ్గిస్తారు. దీన్ని ఎలవెన్స్ అంటారు. కొన్ని రేసుల్లో గెలిచాక ఫుల్‌జాకీగా లైసెన్స్ ఇస్తారు.

16. స్టడ్: గుర్రాన్ని పొర్లించి, దానికి కాన్పు అయేవరకూ ఉంచే స్థలం. స్టడ్‌నుంచి వొచ్చిందంటే పురుడుపోసుకొని దిగిందన్నమాట. అలాటి గుర్రం కాన్పులో కొంత శక్తిని కోల్పోయి ఉంటుంది కనుక, సరిగా పరుగెత్తలేదనే అభిప్రాయం ఉన్నది.

17. కూప్: గుర్రాల యజమానులూ, జాకీలూ అశ్వశిక్షకులూ కలిసి కుట్రచేసి యెవ్వరూ ఊహించని గుర్రాన్ని గెలిపించటం; చాటుగా దాని మీద ఆడుకొని డబ్బు సంపాయిస్తారని అంటారు.

యెలా పరుగెత్తినా మిగతావి సరిగ్గా పరుగెత్తకుండా వుంటే సరి!" అన్నాను.

ముగ్గురూ ఒకేసారి నిట్టూర్చారు.

"రేసింగ్ హిస్టరీలో ఆరో నెంబరు ఉన్న గుర్రం అనేకసార్లు అప్‌సెట్[18] చేసింది!" అన్నాను.

హిస్టరీ స్వయంగా తెలిసున్న వారు కనుక నా ఆర్గ్యూమెంట్‌కు వారు ఎదురాడలేదు.

"నిజమే ననుకోండి....కాని ఈ లక్కీ క్వీన్!" అన్నాడు సింగు, పీళ్ళు నములుతూ.

"దీంతోనే తేలాలి మీ లక్!"

"మీరు రారా?" అన్నాడు ప్రసాద్.

"ఊహుఁ." అన్నాను.

"మీరూ రండి సార్....ఇంతకన్న ఛాన్స్ యీ జన్మలో దొరకదు!" అన్నాడు వెంకటేశ్వరరావు ప్రాధేయపూర్వకంగా-తమకు తోడుగా నేను కూడా మునుగుతే వీళ్ళకూ కొంత తృప్తి.

"నా కొద్దు యీ రేసులు!"

"కీలుగాడి ఇన్‌ఫర్‌మేషన్ ఏమిటీ?" అన్నాడు సింగు.

"నేను కనుక్కోలేదు. మూడు వారాల క్రితం కీలుగా డిచ్చిన ఇన్‌ఫర్‌మేషన్‌తోనేగా మన కీళ్ళన్నీ కదిలిపోయింది!" అన్నాడు ప్రసాద్.

"ఇంతకూ యీ లక్కీ క్వీన్‌కు ఆడ్స్[19] ఎలా ఉంటయ్యో?"

"ఒకటికి యాభై తక్కువ ఉండవు!" అన్నాడు సింగు.

"అందుకే నాకు మరీ నమ్మకం లేకుండా ఉంది!" అన్నాడు వెంకటేశ్వరరావు.

"ఒకటికి యాభైలో ఉన్న గుర్రం ఎన్నడూ గెలవలేదా?" అన్నాను.

---

18. అప్‌సెట్: ఎవ్వరూ ముట్టని గుర్రం గెలిచేప్పటికి జనం తలక్రిందులవుతారు! రేస్‌కూడా తలక్రిందు లైనదని సూచించే పదం!

19. ఆడ్స్: ఏ గుర్రానికి ఎన్నిరెట్లు వొస్తుందో సూచించే సంఖ్య.

"ఒకటికి నూరు ఇచ్చింది కూడా గెలిచింది!" అన్నాడు సింగు.

"అబ్బాయిలూ! మీకు నమ్మకముంటే ఆడండి! లేకపోతే మానెయ్యండి!" అన్నాను.

రేసింగ్ వాల్యూములు కూడా తిరగేసి సీరియస్‌గా చూశారు. లక్కీక్వీన్ విషయంలో నమ్మకం కుదిరే విషయం ఒక్కటీ లేదు.

"ఇదే వాస్తే రేస్‌కోర్స్ 20 అంతా కొన్ని క్షణాలపాటు నిశ్చలమైపోతుంది!"

"నలుగురైదుగురన్నా మూర్ఛపోతారు!"

"మనం ముగ్గురమే డాన్స్ చేస్తాం."

"బుక్కీల 21 దగ్గిర మనం ముగ్గురమే ఉంటాం!"

"వాళ్ళసలు మనకోసం ఎదురు చూస్తూ ఉంటారు."

"మనం ఒక గోనె సంచీ తీసుకుని వెళ్ళాలి!"

వీళ్ళు యీ గుర్రం మీద ఆడి, అది వాస్తే ఏం జరుగుతుందో అనుభవపూర్వకంగా కళ్ళకు కట్టినట్లు చెప్పారు!

---

20. రేస్‌కోర్స్: గుర్రాలు పరుగెత్తేందుకు కేటాయించబడిన స్థలం; 'రేస్ కోర్స్' అనేపదంలో రేసులాడే మొత్తం స్థలమని కూడా భావం.

21. బుక్కీ: రేస్‌లు నడిపే క్లబ్‌వాళ్ళ దగ్గిరా గుర్రాల మీద కాయవాచ్చు; వాళ్ళ దగ్గిర కాస్తే, వసూలైన మొత్తంలో పన్నులూ, వాళ్ళ లాభాలూ తీసేసి మిగతాదే పంచుతారు. అలా కాకుండా 'ఈ గుర్రానికి ఇంత ఇస్తాను-ఆడండి' అనే వాళ్ళు బుక్కీలు. వీళ్ళూ రేస్‌కోర్స్‌లోనే కిళ్ళీ అంగళ్ళల్లే కట్టబడిన బడ్డీలలో ఉండి, బోర్డుమీద అంకెలువేస్తూ జూదరులు కాచేది తీసుకుంటూంటారు. వీళ్ళదగ్గిర ఆడే మొత్తానికి ఎన్నిరెట్లు వాస్తుందో ఖచ్చితంగా చెప్పవాచ్చు. ఎంత కట్టిందీ, ఆ గుర్రం గెలుస్తే తాను ఎంత ఇచ్చేదీ, తన పేరు అచ్చువేసిన కార్డుమీద రాసి ఇస్తాడు బుక్కీ. ఐతే బుక్కీ దగ్గిర కనీసం రూ. 40 కాయాలి.

"సార్! దానికి స్టార్టింగ్ ట్రబుల్ 22 కూడాను!" అన్నాడు సింగు.

"అవునండోయ్! రెండేళ్ళ క్రితం ఏడు ఔటింగ్‌లలోనూ 23 మూడుసార్లు స్టార్టింగ్ గేట్ దగ్గిర 24 ప్లాంట్ 25 ఐంది!" అన్నాడు వెంకటేశ్వరరావు.

"ఏమైనాసరే జాక్‌సన్ ఇన్‌ఫర్మేషనూ, గురువుగారి ఆశీర్వాద బలంవల్ల ఇదే గెలవాలి-నా సాయిరంగా!" అని ప్రసాద్ గుడ్లు తేలేశాడు.

ఇది ట్రిబుల్ 26 ఫస్టులెగ్‌లో ఉన్నది సార్! ఫస్టులెగ్‌కు దీన్ని సర్టె

---

22. స్టార్టింగ్ ట్రబుల్: రేసులో పాల్గొనే గుర్రాలు వరసాగ్గా నిలబడ్డాక, రేసు ఆరంభించే సూచన జరుగుతుంది. ఒక్కసారిగా అన్నిగుర్రాలూ కదులుతవి. ఆ కదలటంలో ఆలస్యమైతే రేసులో గెలవటం కష్టం. మిగతావి బయలుదేరినా, మెల్లిగా పరాకుగా ఉండే గుర్రం బయలుదేరదు. ఇలాటి గుర్రానికి 'స్టార్టింగ్ ట్రబుల్' ఉన్న దంటారు.

23. ఔటింగ్: ఒకోసారి రేసులో పాల్గొనటం ఒకో ఔటింగ్ అనబడుతుంది.

24. స్టార్టింగ్ గేట్: రేసులో పాల్గొనే గుర్రాలు బయలుదేరే స్థలం.

25. ప్లాంట్: నేలకు పాతేసినట్లు కదలకపోవటం.

26. ట్రిబుల్: రోజుకు మొత్తం ఏ ఏడు రేసులో ఉంటే వాటిల్లో రేసు నడిపేవాళ్లు మూడు రేసుల్ని ఎన్నుతారు; ఇవి ఎక్కువ గుర్రాలు పాల్గొనే రేసులూ, గెలిచినవాటికి పెద్ద మొత్తాలూ, లేదా కప్పులు ఇచ్చే రేసులూ ఐ ఉంటవి. యీ మూడు రేసుల్లోనూ గెలిచే గుర్రాలను ఎన్నుకొని ఆ యా నెంబర్లతో టిక్కెట్టు కొనుక్కోవాలి. యీ మూడు రేసుల్నీ మూడు 'లెగ్'లు అంటారు; ఫస్టు లెగ్ అంటే యీ మూడింటా జరిగే మొదటి రేస్ అన్నమాట. మూడు లెగ్స్‌లోనూ ఎన్నిక చేసిన గుర్రాలు గెలుస్తేనే డబ్బు; ఏదిపోయినా టిక్కెట్ మురిగిపోయినట్లే!

నిటీ27 చేసి-సెకండ్ అండ్ థర్డ్ లెగ్స్ కమ్మదాం28." అన్నాడు సింగు.

"అంతే కాదు-యీ రేసులో లక్కీ క్వీన్ విన్ పెట్టి పైనుంచి కిందిదాకా ఫోర్‌కాస్టులు29. కమ్మాలి!" అన్నాడు వెంకటేశ్వరరావు.

అమ్మయ్య! ఇప్పటికి నిషా వీళ్ళకు తల కెక్కింది. ఉన్నదంతా ఈ దెబ్బతో ఊడ్చిపెట్టుకుపోతే ఇకనన్నా బాగుపడతారు! ముగ్గురికీ సరిపడేటంత గొయ్యి తీసుకున్నారు. వీళ్ళ సమాధులు ఏక సమాధిగా రేస్‌కోర్స్‌లోనే యీనాటికి నిశ్చయంగా నిర్మించబడుతుంది! నాకూ మనశ్శాంతి ఏర్పడే శుభ సమయం వస్తోంది! ధన్యోస్మి!

"ఈ లక్కీ క్వీన్‌కు ఆహారం వెతకండి!" అని హెచ్చరించాడు సింగ్.

"గురువుగారు మనం తరించే ఇన్‌ఫర్‌మేషన్ ఎలాగూ తీసుకొస్తారనే నమ్మకంతోనే ఇంట్లో భార్యతో పెద్ద పోట్లాటకైనా ఓర్చి నిన్న సాయంత్రమే దాని మెడలోని గొలుసు తాకట్టు పెట్టి రెండొందలూ తీసుకొచ్చాను. సోమవారం ఉదయమే తాకట్టు విడిపించి దాని గొలుసు దాని మొహాన పారేస్తాను" అన్నాడు ప్రసాద్.

---

27. సర్టెనిటీ: నిశ్చయం చేయటం.

28. లెగ్స్ కమ్మటం: ఒక లెగ్‌లో ఒకే గుర్రాన్ని ఉంచి, మిగతా రెండు లెగ్స్‌లోనూ ఉన్నవన్నీ ఉంచెయ్యటం. ఇందువల్ల మొదటి లెగ్ లోని గుర్రం గెలిచిందా, ట్రిబుల్ పాసైనట్లే భావించవొచ్చు. ఎందుకంటే ఆ మిగతా రెండు లెగ్స్‌లోనూ ఉన్న గుర్రాలన్నిటి మీదా టిక్కెట్లు ఉండనే ఉన్నవి కనుక.

29. ఫోర్‌కాస్ట్: ఒకే రేసులో ఒకటి, రెండుగా వొచ్చే గుర్రాల సంఖ్యను చెప్పటం. ఆ వరుసక్రమంలోనే అవి వొస్తే, డబ్బిస్తారు. దీన్ని 'ఫోర్‌కాస్ట్' అంటారు. మొదటిగా వొచ్చేదాన్ని ఎన్నుకొని, ఆ రేసులో పరుగెత్తే మిగతా అన్నిటినీ రెండోదిగా వరుసక్రమంలో టిక్కెట్ కొంటే, మొదటిది గెలుస్తే ఫోర్‌కాస్ట్‌కు తప్పక డబ్బు వొస్తుంది! ఏందుకంటే ఏది రెండోదిగా వొచ్చినా టిక్కెట్ పాస్ ఐనట్లే కదా!

"ఎప్పుడో చచ్చిన మా అమ్మకు ప్రాణం మీదికి వచ్చిందని నిన్ననే ఆఫీసులో నెల జీతమూ, మరో నెల యెడ్వాన్సూ తీసుకున్నాను - నేనూ రెండొందలు దాకా వేస్తాను!" అన్నాడు వెంకటేశ్వరరావు.

"ప్రస్తుతం నేను మాలిష్‌ను మాత్రమే ధరించే స్థితిలో ఉన్నాను. అంటే వంద! ఐతే నా మిత్రులైన మీతో పాటే మునగటమంటే నాకు ఆనందం! మరో రెండుగంటల వ్యవధి ఉన్నది కనుక ఊరిమీద పడి మరో వంద పట్టుకొచ్చి లక్కీ క్వీన్‌కు దాణాయే వేస్తాను!" అన్నాడు సింగ్ శపథం చేసే ధోరణిలో.

"శుభం-విష్ యూ గుడ్ లక్!"

"గుడ్‌లక్ టూ లక్కీ క్వీన్!"

ముగ్గురూ హఠాత్తుగా, హడావిడిగా లేచారు. వీళ్ళ మనసుకు నేను చెప్పింది వొదలని బంకల్లే పట్టింది. పొరపాటున మరో గుర్రం జోలికి పోకుండా చివరి హెచ్చరికలు చేశాను.

"ఇంకెవరు ఏం చెప్పినా వినకండి! మూడో రేసు దాకా బిగపట్టుకొని ఉండి-అప్పుడు విజృంభించండి!"

"అంతే! అంతే! ఈ దెబ్బతో అటో ఇటో తేలిపోవాలి!" అన్నాడు సింగు.

అందరూ అదే ధోరణిలో తలలు యెగరేస్తూ, హుషారుగా దారి తీశారు.

## 3

హేమా హేమీల్లాంటి త్రిమూర్తులను దారి తప్పించినందుకు నన్ను నేనే అభినందించుకున్నాను. ముగ్గురూ మూడు జతల చేతుల్నీ కాల్చుకుని సాయంత్రానికి వస్తారు; లేదా ఆ నీరసంతో మరి కదల్లేక రేపు ఉదయమే వచ్చి—జాక్సన్‌గాణ్ణీ, డేవిడ్‌గాణ్ణీ, లక్కీ క్వీన్‌నూ, చివరకు నన్ను కూడా దుమ్మెత్తి పోస్తారు. ఈసారితో రేసులకి స్వస్తి చెప్పి బాగుపడతారు. కీడు తలపెట్టినా, దాని ఫలితం మేలే జరుగుతుంది కనుక నిజంగా ఒక గొప్ప మంచి పని చేసినందుకు నేను గర్వపడాల్సి వుంది.

మధ్యాహ్నం భోజనం చేసి పడుకున్నాను. దృష్టంతా రేసుల మీదనే ఉన్నది. మనస్సు అటే లాగుతోంది. ఈ పాటికి మొదటిరేసు తాలూకు గుఱ్రాలమీద రంగు రంగుల దుస్తులు ధరించిన జాకీలు స్టార్టింగ్‌గేట్ వైపు వెళ్తూ ఉంటారనీ-ఈపాటికి రేస్ అయిపోయి రిజల్ట్స్ వేస్తారనీ-ఈ విధంగా ఊహించుకుంటున్నాను. ఏమైనా ఈనాడు వెళ్ళక పోవటమంటే త్రిమూర్తుల కోసం నేను తవ్విన ఏక సమాధిలోకి తెలిసి ఉండీ నేను జారబడకుండటమే కదా!

కాస్త నిద్రపట్టింది. సాయంత్రం నాలుగింటి దాకా బద్ధకంగా ఉంది. ఆ తరువాత స్నానం చేసి టిఫిన్ ఆరగించాను. మొత్తం మీద ఐదున్న రకు యెటన్నా వెళ్దామా అని ఆలోచిస్తున్నాను. ఈపాటికి చివరి రేస్ కూడా ఐపోయి వుంటుంది. త్రిమూర్తులు కడుపుమంటతో నా మీదికి దాడికి వచ్చి పడతారేమో? ఎందుకైనా మంచిది బైట పడదామనే ధోరణిలో ఉన్నాను.

రోడ్డుమీద అడుగు పెడుతున్నానో లేదో ఒక పెద్ద టాక్సీవచ్చి ఆగింది; అది ఆగుతూండగానే "గురూ!....గురూ!" అన్న కేకలు వినిపించినవి. ఉన్నదంతా వొదిలించుకొని నా వీపు తాషామరబా చేసేందుకు ఆలస్యం కాకుండా పెద్ద టాక్సీ వేసుకొనే ఈ త్రిమూర్తులు దిగారా? మొహాలు చూస్తే కళకళ్ళాడుతున్నవి. పొరపాటున లక్కీ క్వీన్ గెలిచిందా?

నా ఊహలు అంతం కాకుండానే ముగ్గురూ ఒక్కసారిగా టాక్సీ లోంచి దూకారు.

"లక్కీ క్వీన్ ముంచేసింది సార్!" అని అరిచాడు సింగ్.

ముంచక వీళ్ళను తేలుస్తుందని నేను అనుకున్నానా? బాగా ముంచుతే మరి ఈ రేసుల జోలికి పోరు కదాననే నా ఆశ ఫలించినందుకు నన్ను నేను అభినందించుకుంటున్నాను.

"స్టార్ట్ యెత్తుకోలేదా?" అన్నాను నా సంతోషాన్ని కప్పి పుచ్చుతూ, వీళ్ళకు సానుభూతి చూపే ధోరణిలో.

"ముంచింది మమ్మల్ని కాదు-రేస్‌కోర్స్‌ను!" అన్నాడు ప్రసాద్. ఆ తరువాత ముగ్గురూ ఒక గుంపుగా సరాసరి నా దగ్గరిగా వచ్చి నన్ను పైకి ఎత్తారు. అక్కణ్ణుంచి వొదిలేస్తారేమోనని భయపడ్డాను. మెల్లిగా కిందికి దించి కావిలించుకున్నారు.

"ఈ దెబ్బతో మా దరిద్రం వొదిలింది!"

"రేసుల్లో తరించాం!"

"భలే ఇన్‌ఫర్‌మేషన్!"

"ఏమైందీ?" అన్నాను వొణుకు పుట్టిన కంఠస్వరంతో.

"లక్కీ-క్వీన్ రెండు లెక్త్‌ల్లో30 గెలిచింది. ఉన్నదంతా ఊడ్చి దానిమీదనే పెట్టి ఏమౌతుందోనని హరినామ స్మరణ చేస్తూ ఒకళ్ళను ఒకళ్లు పట్టుకొని, బిగపట్టుకొని చూశాము. ఉేపులు31 లేపగానే ముందుకు ఉరికింది. తోక పైకెత్తి డేవిడ్‌గాడికి వింజామరలు వీస్తూ పరుగు పరుగున ఉరికింది.... ఏమి గాలప్! గడగ్! గడగ్! మని దూసుకొని వొస్తూంటే—ఆ స్పీడుకు డేవిడ్‌గాడు కింద పడిపోతాడేమోనని భయం. వెనుకనుంచి గుంపులు గుంపులుగా వస్తూన్న గుర్రాలు గడగడా పరుగులెత్తుతూ దీన్ని దూసుకు పోతాయేమోనని దిగులూ వేసింది....'లక్కీ-క్వీన్! లక్కీ-క్వీన్!' అని ముగ్గురమూ ఒకటే అరుపులు. చుట్టూ ఉన్నవాళ్ళు మా వైపు కొర కొరా చూడటం.... ఏమైతేనేం లక్కీ-క్వీన్ క్లియర్‌గా విన్ చేశాక—ఏం ఆడాం! ఏం పాడాం! రేస్‌కోర్స్ అంతా మంత్రముగ్ధవలె నిశ్చలమై ఉండి మా ఆట పాటల్ని పరికించటం మినహా ఏమీ చేయలేక పోయిందనుకోండి!"

---

30. లెక్త్: గెలిచిన గుర్రానికీ, దాని వెనుక ఉన్న గుర్రానికీ మధ్య ఉండే దూరం 'లెక్త్'ల్లో చెపుతారు. ఒక లెక్త్ అంటే ఒక గుర్రపు అంగ అన్నమాట.

31. ఉేపులు; రేసు ఆరంభమయేచోట రిబ్బన్లు కట్టి ఉంచుతారు; గుర్రాలు కాస్త పైనుంచి పరుగెత్తుకొస్తుంటే అన్నీ దాదాపు సరిసమానంగా ఉన్నవని తోచగానే ఆ ఉేపుల్ని పైకి లేపుతారు; అప్పుడు గుర్రాలు పరుగెత్తుకొని రావచ్చన్నమాట.

నా గుండెల్లో రైళ్ళు పరుగెత్తుతూన్నవి.

"ఎంత ఇచ్చారూ?" అన్నాను నీరసమైన కంఠస్వరంతో.

"యాభైలు!....ఆ తర్వాత మరో బుక్కీ అరవైలు అంటే అక్కడా, ఒక వంద ఆడాం! మొత్తం ఫోర్‌కాస్టులు బొత్తి....ఫోర్‌కాస్టు తొమ్మిదివేల నాలుగొందల డెభ్భై ఆరు! ట్రిబిల్ పాస్: ముప్పైరెండు వేలు! తలా పదిహేడువేలూ పుంజుకున్నాం! నేటికి రేసుల్లో ధన్యుల మయ్యాం! మీ ఆశీర్వాద బలం!!!"

నేను నిలబడిన భూమి కుంగిపోతూన్నట్లుంది.

"మీరు రాకపోవటమే విచారం!"

ఏ ముహూర్తాన వీళ్ళ కీ వెధవ ఇన్‌ఫరమేషన్ చెప్పానో అని నా బాధ! చూస్తూ చూస్తూ పదిహేడువేలు పోగొట్టుకోవటమే కాదు-అనవసరంగా యీ త్రిమూర్తుల్ని ఐశ్వర్యవంతుల్ని చేశాను! ఇంత మనోక్షోభ జీవితంలో ఎప్పుడూ అనుభవించలేదు!

"ముందు మీ కిప్పుడో పెద్ద పార్టీ చేయాలి!"

నేను అచేతనుణ్ణిగా ఉన్నా వాళ్ళు ముగ్గురూ నన్ను పట్టి టాక్సీలో కూలేశారు. ఆ తరువాత మౌంట్‌రోడ్‌లోని పెద్ద హోటల్‌లో పార్టీ. నన్ను ఇంటి దగ్గర దింపి "ఆ జాక్సన్‌గాడికి మూడువేలూ ఇవ్వండి—" అని తలా వెయ్యీ నా మొహాన పారేశారు. జాక్సన్ పేరిట నాకు దక్కింది ఇంతే ననుకున్నాను.

ఎంత దురదృష్టం! ఆశించింది వేరూ-అనుభవించేది వేరూను! నెట్ లాస్ పధ్నాలుగు వేలు!

"ఇది ఇచ్చి ప్రతివారమూ మనకు సరైన ఇన్‌ఫర్‌మేషన్ ఇమ్మనండి. మనం వెలలు చెల్లిస్తాం!" అన్నాడు వెంకటేశ్వరరావు ధీమాగా.

"సరే - మేము వస్తాం, సార్!" అని అందరూ సెలవు తీసుకొన్నారు.

జాక్సన్ కాదుగదా వాడి బాబు కూడా ఇవ్వలేని ఇన్‌ఫర్మేషన్ ఇచ్చాను. ఇలాటిది మళ్ళీ ఈ జీవితంలో దొరుకుతుం దనుకోను. త్రిమూర్తుల్లాగే నేను కూడా ప్రతివారమూ రేస్‌లకు వెళ్ళి, ఓర్పుతో గుర్రాలను పోషిస్తూ ఉంటే యీ జన్మ చాలించేలోపున ఎప్పుడో నాకూ ఒక ఛాన్సు తగులుతుంది. ఎప్పుడో, ఎట్లాగో నాకే తెలియదు!

మళ్ళీ మామూలుగా రేస్‌లకు వెళ్ళటం సాగించాం. త్రిమూర్తులు గెలుచుకున్న దంతా కక్కారు. నాకూ చిలుము వొదులుతూనే ఉన్నది. అలాటి చమ్కీ-ఛాన్స్ మళ్ళీ రాలేదు.

"ఇప్పుడు జాక్‌సన్ ఇన్‌ఫర్‌మేషన్ అంత బాగుండటంలేదు!" అని ఒకరూ—

"గురువుగారు కాస్త ఓపిక చేసుకోక పోతే యీ ఊబిలోంచి మనం బైటపడం!" అని మరొకరూ—

"లక్కీ క్వీన్‌తోనే మన లక్కంతా ఐపోయినట్లుంది!" అని ఇంకోరూను!

ఇప్పుడు ఆరు నెలలు రేసుల్లో పోవటమూ. మరో ఆరు నెలలు పోకపోవటమూను-అంటే ఆ ఆరునెలలూ రేసు లుండకపోవటమే కారణం! అప్పులు చేసో, అర్థించో, పిండో ఏదో విధంగా మరో పంచవర్ష ప్రణాళిక నడుపుతూనే ఉన్నాం!

నలుగురూ ఊబిలో కూరుకొని పొయ్యాం. యీసారి ఎంత బలమైన గుర్రమైనా మమ్మ పైకి లాగలేదు. ఇనుప గొలుసులు వేసి ఏనుగులూ, తిమింగలాలూ లాగుతే తప్ప లాభంలేదు. వాటి రాకకోసం ఎదురు చూస్తూ ఇలాగే ఊబిలోకి - కిందికి, యింకా కిందికి దిగబడి పోతున్నాం!

—ఆగస్టు, 1959